సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 13.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 201
పేజీలు: 08 వెల: రూ. 5

## భక్తజన సంద్రం కొండగట్టు

### హనుమాన్ జయంతి వేళ పోటెత్తిన అంజన్న భక్తులు

- జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగిన అంజన్న క్షేత్రం
- మాల విరమణ కోసం భారీగా తరలివచ్చిన భక్తజనం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కొండగట్టులో భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

03



## రెండోసారి హిమంత ప్రమాణం

### ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా

04

- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, చంద్రబాబు
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్డీయే కూటమి



## నీట్ రద్దు !

### సంచలన నిర్ణయం తీసుకున్న ఎన్టీఏ




- దేశవ్యాప్తంగా సంచలనం
- రాజస్థాన్లో ప్రశ్నపత్రం లీక్ కావడమే కారణం
- దర్యాప్తు చేస్తున్న సీబీఐ
- ఇప్పటికే పలువురి అరెస్ట్
- త్వరలోనే కొత్త తేదీలో పరీక్ష
- ఎటువంటి అదనపు ఫీజు లేకుండానే పరీక్షకు అనుమతి

02

## హైకోర్టుకు భగీరథ్

### పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ పిటీషన్

03

- లైంగిక ఆరోపణలన్నీ రాజకీయ కక్షలో భాగమేనని వెల్లడి
- భగీరథ్ కేసుపై సిట్ ఏర్పాటు.. మహిళా ఐపీఎస్ పర్యవేక్షణలో దర్యాప్తు
- నేరం రుజువైతే కఠిన చర్యలు తప్పవని కూకట్పల్లి డీసీపీ హెచ్చరిక





## తెలంగాణలో ఇంటర్ బోర్డ్ రద్దు?

### విద్యా వ్యవస్థలో భారీ మార్పులు!

- నర్సరీ నుంచి 12వ తరగతి వరకూ ఒకేచోటే చదువు..
- సీఎం రేవంత్ కీలక ప్రకటన
- ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య..
- కొత్త ఎడ్యుకేషన్ పాలసీకి శ్రీకారం
- డ్రాపౌట్స్ తగ్గించేందుకే కొత్త ప్లాన్.. స్కూళ్లలోనే ఇంటర్ విద్య!
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన
- టీచర్లకు జపాన్, సింగపూర్ శిక్షణ
- విద్యార్థులకు రూ. లక్ష ప్రోత్సాహకాలు
- విద్యపై భారీ ఫోకస్..
- బడ్జెట్లో 15% నిధుల కేటాయింపుకు ప్రభుత్వం సిద్ధం

**ముద్ర డెస్క్ :**
నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'విద్యా వారోత్సవాల' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్ అర్బన్ ఏరియా (CURE)లో రూ. 1011 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు' సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పాఠశాలలు దేశ భవిష్యత్తును నిర్మించే వేదికలని, ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలను అనాథలుగా కాకుండా, సొంత బిడ్డల్లా ఆదరించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఆయన పేర్కొన్నారు.

**ఇంటర్ బోర్డ్ రద్దు అవుతుందా..**

తెలంగాణలో గత కొన్ని రోజులుగా విద్యా వ్యవస్థకు సంబంధించి ఇంటర్ బోర్డు రద్దు అవుతుందని చర్చ జరుగుతోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అందుకు ఊతమిచ్చేలా ఉన్నాయి. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట చదువు చెప్పాలని, స్కూళ్లోనే ఈ క్లాసులు నిర్వహించే విధానాన్ని ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దాంతో త్వరలోనే ఇంటర్ బోర్డ్ రద్దు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**నూతన విద్యా విధానం అమలు..**

ప్రస్తుత ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ వంటి మార్పులకు అనుగుణంగా తెలంగాణలో నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా పదో తరగతి తర్వాత విద్యార్థులు చదువు మానేయకుండా (డ్రాపౌట్స్) ఉండేందుకు, నర్సరీ నుంచి 12వ తరగతి మిగతా 02లో

## ఇంటింటికీ గణన

### తెలంగాణ జనగణనతో ప్రగతికి బాట

- ఒక్కో ఫ్యామిలీకి గంట సమయం
- ప్రతి కట్టడానికీ ప్రత్యేక నెంబర్
- స్వీయగణనలో అంతంత మాత్రమే నమోదు
- తెలంగాణలో 3.60 కోట్ల జనాభా అంచనా
- ఆన్ లైన్ నమోదు చేసుకోని ఐటీ ఉద్యోగులు
- జూన్ 9వరకు కొనసాగనున్న ఇంటింటి ప్రక్రియ

**ముద్ర డెస్క్:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన జనగణన ప్రక్రియ అత్యంత వేగంగా క్షుణ్ణంగా కొనసాగుతోంది. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దిక్సూచిగా నిలిచే ఈ భారీ కసరత్తులో భాగంగా గణాంక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. జూన్ 9వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగే ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటి గడపనూ అధికారులు తట్టనున్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభా సుమారు రూ. 3.86 కోట్ల వరకు ఉంటుందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ఈ అంచనాలను శాస్త్రీయంగా ధ్రువీకరించేందుకు, ప్రతి పౌరుడి వివరాలను రికార్డు చేసేందుకు ప్రభుత్వం మొదటి దశ ఇంటింటి సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ కేవలం మనుషుల లెక్కింపు మాత్రమే కాదు, రాష్ట్రంలోని భౌగోళిక, ఆర్థిక స్థితిగతుల ప్రతిబింబం.

**ప్రతి కట్టడానికీ ఒక ప్రత్యేక ముద్ర**

ఈసారి గణనలో సాంకేతికతను జోడిస్తూ, రాష్ట్రంలోని ప్రతి కట్టడానికీ (ఇల్లు, కార్యాలయం లేదా వాణిజ్య సముదాయం) ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో పట్టణీకరణ, మౌలిక సదుపాయాల కల్పన సులభతరం అవుతుంది. ఒక సగటు కుటుంబం మిగతా 02లో



## జనజీవన స్రవంతిలోకి పసునూరి

- మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ
- భార్యతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాటు
- మావో ఉద్యమంలో క్రియాశీలక పాత్ర

03



## బాలుడి హత్య కేసులో కీలక తీర్పు

### ఇమ్రాన్ అలీ ఖాన్కు ఉరిశిక్ష



- చాక్లెట్ ఆశ చూపి బాలుడి హత్య..
- సీసీటీవీ, కాల్ డేటాతో బట్టబయలైన దారుణం..
- సహ నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

04

## పని చేసే వారికే పదవులు

### క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం

- పార్టీ కీలక నేతల సమావేశంలో కేసీఆర్ దిశా నిర్దేశం
- ప్రతి కమిటీలోనూ మహిళలకు ప్రాధాన్యం

02



## నన్ను కెలికారు..

### కన్న పేగును క్షోభ పెడుతున్నారు

కరీంనగర్ 'హిందూ ఏక్తా యాత్ర'లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

04





02

## మిషన్ మోడ్లో ధాన్యం సేకరణ

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్లో సీఎం రేవంత్ రెడ్డి

- కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి
- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 13.05.2026
www.mudranews.in | @mudranews



### ఉల్లిపాయ రసం + కొబ్బరి నూనెతో మర్దన



రెండు స్పూన్ల ఉల్లిపాయ రసంలో రెండు స్పూన్ల కొబ్బరి నూనె కలిపి తలకు మర్దన చేయాలి. ఇది జుట్టు కుదుళ్లకు పోషణ అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే జుట్టు మరింత బలంగా, ఒత్తుగా మారుతుంది.

# తెలంగాణలో ఇంటర్ బోర్డ్ రద్దు?



(మొదటి పేజీ తరువాయి)
వరకు ఒకేచోట (స్కూల్‌లోనే) విద్యనందించే విధానాన్ని ప్రవేశపెడుతున్నామన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో 8.22 శాతం నిధులను కేటాయించిందని, భవిష్యత్తులో దీనిని 15 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం చేసే ఖర్చును భావి తరాల అభివృద్ధికి పెట్టే పెట్టుబడిగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**టీచర్ అంటే జాబ్ కాదు.. గొప్ప బాధ్యత..**
విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో టీచర్ల పాత్ర అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, అది ఒక గొప్ప భావోద్వేగమని, బాధ్యత అని ఆయన అన్నారు. బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఏటా 500 మంది ఉత్తమ ఉపాధ్యాయులను జపాన్, సింగపూర్ వంటి దేశాలకు అధ్యయనం కోసం పంపనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు 'అమ్మ ఒడి'లా ఉండాలని, వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం, పాఠశాల ప్రారంభమైన రోజే నాణ్యమైన యూనిఫాం అందించేందుకు రూ. 1000 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థులు, టీచర్లకు రూ.1 లక్ష ప్రోత్సాహక చెక్కులు**
తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్లు భాగస్వామ్యం కావాలని, రాష్ట్ర విద్యా విధానాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే తన కల అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు తలా రూ. లక్ష చొప్పున ప్రోత్సాహక చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## మిషన్ మోడ్‌లో
# ధాన్యం సేకరణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ**
అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతీ ఐకేపి సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్**
ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

### రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభు త్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతం లో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధా న్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందు కు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

# ఇంటింటికీ గణన..

(మొదటి పేజీ తరువాయి)
వివరాలను సేకరించేందుకు గణకులు దాదాపు ఒక గంట సమయం వెచ్చిస్తున్నారు. కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబరుతో పాటు ఇంట్లో ఉన్న వసతులు, విద్య, ఉపాధి వంటి కీలక అంశాలను నమోదు చేస్తున్నారు.

**ఐటీ ఉద్యోగుల విస్మయం.. ఆన్‌లైన్ నమోదులో వెనుకబాటు**
ఈ జనగణనలో అత్యంత చర్చనీయాంశమైన విషయం ఐటీ ఉద్యోగుల స్పందన. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఐటీ నిపుణులు ఉండగా, వారిలో అత్యధికులు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లోనే నివసిస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన 'స్వీయ గణన' అవకాశాన్ని వీరు సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవ్వడంపై కేంద్ర జనాభా లెక్కల విభాగం ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ, సగం మంది ఐటీ ఉద్యోగులు కూడా ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోలేదు. దీనివల్ల ఇప్పుడు గణకులు ప్రత్యక్షంగా వారి నివాసాలకు వెళ్లి వివరాలు సేకరించాల్సి వస్తోంది.

**సవాళ్లు.. క్షేత్రస్థాయి పరిస్థితులు**
పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు మరియు అపార్ట్‌మెంట్లలో నివసించే వారు వివరాలు వెల్లడించడానికి కొంత సంకోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయని, కేవలం అభివృద్ధి ప్రణాళికల కోసమే వీటిని సేకరిస్తున్నామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**గడువు గుర్తుంచుకోండి**
ఈ ఇంటింటి సేకరణ ప్రక్రియ జూన్ 9 వరకు కొనసాగుతుంది. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించి, ఖచ్చితమైన వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం కోరుతోంది. రాష్ట్ర జనాభా అంచనా 3.60 కోట్ల నుండి 3.86 కోట్ల మధ్య ఊగిసలాడుతున్న తరుణంలో, ఈ ప్రత్యక్ష గణన అత్యంత కీలకం. ఐటీ కారిడార్లలో ఉన్న విద్యావంతులు సైతం బాధ్యతగా ఈ ప్రక్రియలో పాల్గొంటేనే, రాబోయే దశాబ్ద కాలానికి అవసరమైన వనరుల కేటాయింపు సజావుగా సాగుతుంది. ఒక్కో కుటుంబం కేటాయించే ఆ ఒక గంట సమయం, రేపటి తెలంగాణ ఉజ్వల భవిష్యత్తుకు పునాది కానుంది.

# పని చేసే వారికే పదవులు

**ముద్ర, హైదరాబాద్:**
బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఐదు గంటలుగా కొనసాగుతోంది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరుగుతోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు.



అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.
మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చిస్తున్నారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# నీట్ రద్దు!

**ముద్ర డెస్క్ :**
జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ–2026) ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నేపథ్యంలో జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. మే 3న నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది.
విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ ని ర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. పరీక్షను మళ్లీ రాయాల్సి వచ్చినా అభ్యర్థులు మరోసారి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, అదనపు ఫీజులు చెల్లించనక్కర్లేదని పేర్కొంది. కొత్త తేదీలకు అనుగుణంగా అడ్మిట్ కార్డులు తిరిగి జారీ చేస్తామని వెల్లడించింది.
ఇక ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందే వాట్సాప్ ద్వారా ప్రాక్టీస్ పేపర్ పేరుతో ప్రశ్నలు చక్కర్లు కొట్టినట్లు పోలీసులు గుర్తించారు. అందులోని అనేక ప్రశ్నలు అసలు నీట్ పరీక్ష ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు విచారణలో తేలింది.
ఈ లీక్ వ్యవహారానికి సంబంధించి పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యార్థుల నుంచి రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి ప్రశ్నలు విక్రయించినట్లు అధికారు లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.




## ఉక్రెయిన్ సైనికుల
# పరిస్థితి దారుణం!

**ముద్ర డెస్క్ :**
ఏ మనిషికైనా సరే పీల్చే గాలి తర్వాత.. తాగే నీటి తర్వాత అత్యంత ముఖ్యమైనది ఆహారం. ఆ జానెడు పొట్టను నింపుకోవడానికి మనిషి రకరకాల పనులు చేస్తుంటాడు.. కానీ ఆ పొట్ట నిండడమే కష్టం అనుకుంటే.. పొట్ట నిండుగా ఆహారం కూడా వెళ్లే మార్గం లేకపోతే.. అంతకుమించిన దరిద్రం మరొకటి ఉండదు. ఆదిమ కాలంలో మనుషులు ఆహారం కోసం అన్వేషణ సాగించారు. ఆ ఆహారాన్ని తమకు తాముగా సంపాదించుకున్నారు. అనేక క్రమాలుగా మనుషులుగా ఎదిగిన తర్వాత గొప్పగా జీవించడం మొదలుపెట్టారు. మనుషులు అభివృద్ధి చెందే క్రమంలో ఆలోచనలు గొప్పగా ఉండాలి.. జీవితం మరింత ఉన్నతంగా ఉండాలి. అలాకాకుండా రాతియుగంలోకి మనుషులు వెళ్లిపోయి.. దారుణమైన స్థితిలోకి మరలిపోతుంటే అంతకుమించిన తీరుగమనం మరొకటి ఏముంటుంది.
కొంతకాలంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం సాగిస్తున్నాయి. రెండు వైపులా కూడా తీవ్రమైన ప్రాణ నష్టం చోటుచేసుకుంది. ఆస్తి నష్టం.. ఆర్థికంగా నష్టం విపరీతంగా జరిగింది. అయినప్పటికీ రెండు దేశాలు ఏమాత్రం పట్టు విడిపోవడం లేదు. మరింత దారుణంగా దాడులు చేసుకుంటున్నాయి. వాస్తవానికి యుద్ధం వల్ల రష సాధించింది లేదు. ఉక్రెయిన్ వెనకేసుకున్నది లేదు. రెండు దేశాల సంబంధించిన అధిపతులు బాగానే ఉన్నారు.. పైగా రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసుకుంటున్నారు.
యుద్ధం అంటే ముందు వరుసలో ఉండి చేసేది సైనికులు మాత్రమే. ఆ సైనికుల ప్రాణాలు ఇప్పుడు గాలిలో దీపాలుగా మారిపోయాయి. ముఖ్యంగా ఉక్రెయిన్ దేశానికి సంబంధించిన సైనికులు అత్యంత దారుణమైన స్థితిలో ఉన్నారు.. కనీసం వారికి తినడానికి తిండి కూడా లేదు.. గత నెల చివరిలో ఉక్రెయిన్ దేశానికి చెందిన నలుగురు సైనికులు చనిపోయారు. వారి దృశ్యాలు అత్యంత కలవరపరిచే విధంగా ఉన్నాయి.. 17 రోజులుగా సైనికులకు ఎటువంటి ఆహారం సరఫరా చేయకపోవడంతో.. సైనికులు ఆకలితో అల్మటించి చనిపోయినట్టు తెలుస్తోంది. ఆకలి తట్టుకోలేక వా రు వాన నీళ్లు తాగారు. ఉక్రెయిన్ సైన్యంలో 14వ మేకనైజ్డ్ బ్రిగేడ్లో పనిచేస్తున్న సైనికుడి భర్త అనస్తాసియా సిల్చుక్ తన భర్త ఫోటోను ఏప్రిల్ 22న సోషల్ మీడియాలో బయటపెట్టింది.



రష్యా బాంబుదాడులతో ధ్వంసం చేసిన తర్వాత ఆగ్నేయ డొనేట్స్ ప్రాంతంలో ఓసికిల్ నదికి ఎడమ, తూర్పు ఒడ్డు ప్రాంతంలో ఉక్రెయిన్ సైనికులు తలదాచుకున్నారు. ఆహారం లేక, తాగడానికి నీరు లేక సైనికులు ఆకలి కేకలు వేశారని తెలుస్తోంది. సైనికుడు ఓలెక్సాండర్ తన మాతృభూమి కోసం పోరాడుతున్నప్పుడు తీవ్రమైన ఆకలి బాధను అనుభవించాలని ఆల్ జజీరా అనే మీడియా సంస్థ ఇంటర్వ్యూలో చెప్పాడు. "వారాల తరబడి మీకు రోజుకు చాక్లెట్ బార్లు, ఓట్ మీల్, వాటర్ బాటిల్ మాత్రమే లభిస్తాయి. కాబట్టి మీరు వేడి భోజనం కోసం కలలు కనకూడదు" అంటూ కీవ్ లో కాలిగాయం నుంచి కోరుకుంటున్న ఓ సైనికుడు మీడియా ఇంటర్వ్యూలో తన బాధ వ్యక్తం చేశాడు. ఉక్రెయిన్ సైనికులు ఏ స్థాయిలో ఇబ్బం ది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

బుధవారం 13.05.2026

www.mudranews.in | @mudranews



### చుండ్రు సమస్యకు ఉల్లిపాయ-నిమ్మరసం

చిట్కాకొద్దిగా ఉల్లిపాయ రసంలో రెండు స్పూన్ల నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. ఈ మిశ్రమం స్కాల్ప్‌లోని బ్యాక్టీరియా, ఫంగస్‌ను తగ్గించి చుండ్రు సమస్యను దూరం చేస్తుంది.



## హైకోర్టు కు బండి భగీరథ్

**పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ పిటీషన్**
**లైంగిక ఆరోపణలన్నీ రాజకీయ కక్షలో భాగమేనని వెల్లడి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. మరోవైఒఉ సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు. పోక్సో కేసు విచారణ కోసం బండి భగీరథ్‌కు సిట్ మంగళవారం సాయంత్రం నోటీసులు జారీ చేసింది. నేడు మధ్యాహ్నం 2 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది.

## జనజీవనంలో మావోయిస్టు పసునూరి

**భార్యతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాటు**
**ఉద్యమంలో క్రియాశీలక పాత్ర**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అజ్ఞాతం వీడారు. భార్యతో కలిసి మంగళవారం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. హన్మకొండ జిల్లా కాజీపేట మండల పరిధిలోని సోమిడి గ్రామానికి చెందిన చెందిన పసునూరి నర్సమ్మ–సోమనారాయణకు ఐదుగురు కొడుకులు. అందులో రెండో కుమారుడు నరహరి. 1980లో ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మావోయిస్టు ఉద్యమాలు, విధానాలకు ఆకర్షితుడయ్యాడు. అప్పటి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పులి అంజయ్య, క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్నతో ఏర్పడిన సాన్నిహిత్యం నరహరిని ఉద్యమం వైపునకు వెళ్లేలా చేసింది. గ్రామంలో ఉంటూ కూలీల రేట్లు పెంచడంతో పాటు భూస్వాములు, రౌడీలకు వ్యతిరేకంగా ఆయన తిరుగుబావుట ఎగురవేశారు. అప్పటి ఆర్‌ఈసీలో ఉన్న ఉద్యమ నాయకుల మాటలతో ప్రభావితమైన నరహరి... పోలీసుల నిర్బంధం పెరగడంతో అడవి బాటపట్టారు. ఉద్యమంలో క్రియాశీలక పాత్ర..పసునూరి నరహరి గత కొన్ని దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. క్రమంగా పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ.. కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడిగా, జార్ఖండ్ ఈస్ట్ రీజినల్ బ్యూరో టెక్నికల్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ కాగా, ఆమె కూడా పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్నట్లుగా సమాచారం.కూంబింగ్ సెగతోనే లొంగుబాటు..తాజాగా జార్ఖండ్ లోని సరండా అడవుల్లో భద్రతా బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్రా లక్ష్యంగా పోలీసులు వేటను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో అడవుల్లో భద్రతా బలగాల ఒత్తిడి పెరగడం, మరోవైపు అనారోగ్య కారణాల రీత్యా నరహరి దంపతులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జార్ఖండ్ అడవుల నుంచి రహస్యంగా తెలంగాణకు చేరుకున్న వీరు.. తాజాగా పోలీసుల ఎదుట లొంగిపోయారు.

**అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్లో**

## అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ




**ముద్ర, కరీంనగర్ :** అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (UGEE)లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మరోసారి తమ సత్తా చాటారు. అల్ఫోర్స్ కు చెందిన పూట్కూరి శ్రేయాన్ రెడ్డి, గుజ్జుల అశీష్ రెడ్డి, గంగడి చైత్ర అద్భుత ప్రతిభతో ఐఐఐటి హైదరాబాద్ లో సీట్ల సాధనకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిరంతర కృషి మరియు పట్టుదలతో ఎలాంటి పోటీ పరీక్షలలోనైనా విజయం సాధించవచ్చని తమ విద్యార్థులు నిరూపించారని అన్నారు. ఇంటర్వ్యూలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఐఐఐటి హైదరాబాద్ లో సీట్లు సాధిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు.ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## నర్సులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

**కార్మిక శాఖ మంత్రి వివేక్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని నర్సులకు విదేశాల్లో ముఖ్యంగా జర్మనీలో అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'ట్రిపుల్ విన్' ప్రోగ్రాం వివరాలను వెల్లడించారు. ఈ ప్రోగ్రాం కింద శిక్షణ పొందిన సుమారు 79 మంది నర్సులు త్వరలోనే జర్మనీకి వెళ్లనున్నారని తెలిపారు. జర్మనీలో రోగులతో సంభాషించడానికి నర్సులకు జర్మన్ భాష శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. సీఎం విదేశీ విద్యానిధి కింద, అభ్యర్థుల వీసా, ఇతర ఖర్చులపై ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందిస్తోందని హామీ ఇచ్చారు. ఏజెంట్ల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వ సంస్థ 'టామ్‌కామ్' ద్వారా ఈ నియామకాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, శిక్షణ పొందిన విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులను

# కాషాయ సంద్రంగా కొండగట్టు



**హనుమాన్ జయంతి వేళ పోటెత్తిన అంజన్న భక్తులు... కొండగట్టులో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**









**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల మూడవ రోజు కాషాయమయంగా మారింది. రామనామ జపంతో కొండగట్టు అంజన్న క్షేత్రం మారు మ్రోగుతుంది. హనుమాన్ జయంతి రోజు కావడంతో రాత్రి నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరగగా, ఆలయ పరిసరాలు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మార్మోగిపోయాయి. హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో మాలధారులు కొండగట్టుకు తరలివచ్చి మాల విరమణ చేసుకుని స్వామివారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నారు.కొండగట్టులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్...కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, మాల విరమణ ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, ఆలయ ఈవో అంజనా రెడ్డి, ఆర్డీవో మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఖైదీలందరూ నేరస్తులు కారు

**పరిస్థితులు వారిని నిందితులుగా మారుస్తాయి**
**విద్యార్థి దశలో నేనూ 21 రోజులు జైలుకెళ్లా**
**ఖైదీల్లో మార్పు కోసం ప్రత్యేక చర్యలు అవసరం**
**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**
**చంచల్‌గూడ జైలులో మ్యూజియం, ఫీల్ ది జైల్ ఏర్పాటు**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** జైళ్లలో శిక్ష అనుభవిస్తోన్న ఖైదీలందరూ నేరస్తులు కాదని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వెల్లడించారు. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీల్లో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని చంచల్ గూడ జైలు అధికారులకు సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలన్నారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని గవర్నర్ తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.21 రోజులు జైలులో ఉన్న..విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానని గవర్నర్ చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ

## కేంద్ర వైఫల్యంతోనే నీట్ లీకేజీ, రద్దు

**మంత్రి పొన్నం ప్రభాకర్**
**లక్షలాది మంది విద్యార్థుల ఆశలు గల్లంతు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశవ్యాప్తంగా పరీక్ష రద్దు చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో ఆశలతో ఎంట్రన్స్ టెస్ట్ రాయగా కొందరు చేసిన పనికి వారంతా ప్రభావితులవుతున్నారని వాపోయారు. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని నీట్ పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందన్నారు. విద్యావ్యవస్థ పరువు పోయిందని, కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## క్యూర్ పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇండ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం నగరానికి చాలా దూరంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అదే పరిస్థితి పునరావృతం కాకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ భూములు, మురికివాడలు, శిధిలావస్థలో ఉన్న కాలనీలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన 2బిహెచ్‌కే ఇండ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయింపులు పూర్తి చేయాలని, అలాగే హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు కలిగిన అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందించాలని ఆదేశించారు. జూన్ 2న ఆదిలాబాద్‌లో రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు ఐటి శాఖలు, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముఖ్యమైనదని అన్నారు.శాసనసభ స్పీకర్ శ్రీ జి. ప్రసాద కుమార్ మాట్లాడుతూ శాసనసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహించడం పట్ల మంత్రికి అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పగా అమలు అవుతున్నదని, జిల్లా స్థాయిలో కలెక్టర్లు ప్రతివారం ఈ పథకాన్ని సమీక్షించి పేదలకు మేలు కలిగేలా చూడాలన్నారు

### సాగునీటి ప్రాజెక్టులపై పునరాలోచన చేయాలి



**ముద్ర, హైదరాబాద్ :** భారీ సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభ రెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ప్రపంచ వ్యాప్తంగా భారీ సాగునీటి ప్రాజెక్టుల అనుభవాలు ఆశాజనకంగా లేవని, భారీ వ్యయాలు, పర్యావరణ నష్టం, భూసేకరణ సమస్యలు, అవినీతి వంటి అంశాలు వీటితో ముడిపడి ఉన్నాయన్నారు. తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టులపై లక్షల కోట్ల ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును చేపట్టడం కంటే కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి సారించాలని కోరారు.

### కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి



**ముద్ర, హైదరాబాద్ :** నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, త్వరగా పరీక్ష నిర్వహించాలని కోరింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 13.05.2026
www.mudranews.in | @mudranews



### కొత్త జుట్టు మొలకలకు సహజ చికిత్స



ఉల్లిపాయ రసంలో ఉండే సల్ఫర్ జుట్టు కుదుళ్లలో రక్తప్రసరణను పెంచి కొత్త జుట్టు మొలకెత్తేందుకు సహాయ పడుతుంది. క్రమం తప్పకుండా ఉపయోగిస్తే పలుచబడిన జుట్టు క్రమంగా ఒత్తుగా కనిపిస్తుంది.

# నన్ను కెలికారు... కన్న పేగును క్షోభ పెడుతున్నారు

**- కరీంనగర్ ''హిందూ ఏక్తా యాత్ర''లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**
**- హిందుత్వ వాదుల నినాదాలతో ముందుకు సాగుతున్న ఏక్తా యాత్ర**





**ముద్ర, కరీంనగర్** : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన కుమారుడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తొలిసారిగా భావోద్వేగంగా స్పందించారు. "నా కొడుకు తప్పు చేయలేదని చెబుతున్నాడు. అయినా చట్టం ముందు అందరూ సమానమే. నిజానిజాలు కోర్టులే తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే" అంటూ ఆయన స్పష్టం చేశారు.

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్‌లో నిర్వహించిన "హిందూ ఏక్తా యాత్ర"లో పాల్గొన్న బండి సంజయ్, వేలాది మంది కార్యకర్తల మధ్య ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. వైశ్యాభవన్ నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో కాషాయ జెండాలతో నగరం నిండిపోయింది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా ప్రజల కోసమే పనిచేశా. ప్రతి ఇంటి కష్టాన్ని నా కష్టంగా తీసుకున్నా. కానీ నా కొడుకుకు సమయం ఇవ్వలేకపోయా. ఆ తప్పు నాదే. నన్ను క్షమించండి" అంటూ తెలంగాణ ప్రజలను ఉద్దేశించి విజ్ఞప్తి చేశారు.

తన రాజకీయ ప్రయాణం చిన్న కార్యకర్తగా ప్రారంభమైందని, ఎన్నో కష్టాలు, కేసులు, జైలు జీవితం ఎదురైనా వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. "హార్ట్‌లో స్టంట్ ఉన్నా 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేశా. ప్రజల సమ స్యల కోసం పోరాడా. హిందువుల ఐక్యత కోసం 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నా" అని అన్నారు. తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించిన బండి సంజయ్, "నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. నన్ను, నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టను" అంటూ హెచ్చరించారు.అయితే మరోవైపు చట్టవ్యవస్థపై పూర్తి గౌరవం ఉందని ఆయన స్పష్టం చేశారు. "నా కొడుకు తప్పు చేయలేదని చెబుతున్నాడు. అయినా నేను సమర్థించడం లేదు. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్ట ప్రకారం ఏ చర్యలైనా తీసుకోవచ్చు" అని తెలిపారు.

తన భార్య కూడా కార్యకర్తలకు సహాయం చేస్తూ ప్రజాసేవలో భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తమ కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రసంగం చివర్లో బండి సంజయ్ మరింత భావోద్వేగానికి లోనయ్యారు. "శ్రీరాముడికే కష్టాలు తప్పలేదు. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటిస్తే, ఆ నిప్పుతో అవినీతి గడీలను కూల్చివేస్తా. నా చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసం పనిచేస్తా" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు





**ముద్ర , కరీంనగర్** : పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయుడిని భక్తితో ఆరాధించిన వారికి సకల శుభాలు కలుగుతాయని, జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోతాయని అన్నారు. హనుమంతుడు గురుభక్తి, ధైర్యం, క్రమశిక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. శ్రీరాముని ఆజ్ఞలను ఆలస్యం లేకుండా అమలు చేసి సత్ఫలితాలు సాధించిన మహానుభావుడు ఆంజనేయుడని కొనియాడారు. హనుమాన్ జయంతి రోజున భక్తులు ఉపవాసం పాటిస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేయడం భారతీయ సంప్రదాయంలో భాగమని తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి రోజున హనుమాన్ జయంతిని జరుపుకోవడం విశేషమని పేర్కొన్నారు. ఆంజనేయుడు బలవంతుడు, ధైర్యవంతుడు, సద్గుణవంతుడు అని కొనియాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రూపాలలో భక్తులు ఆరాధిస్తారని చెప్పారు. జయంతి సందర్భంగా ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించగా, హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఈ కార్యక్రమం బ్రహ్మశ్రీ డా. గర్రెపల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. అనంతరం మృత్విక్కుల బృందం డా. నరేందర్ రెడ్డిని ఆశీర్వదించి, చేపట్టబోయే కార్యక్రమాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యాసంస్థల సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నికితకు డాక్టరేట్



**ముద్ర, హైదరాబాద్ :** ఇంగ్లీష్ భాషా బోధనలో పరిశోధనాత్మక కృషికి గుర్తింపుగా జి.ఆర్. నికితకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా లభించింది. భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్-చాన్స్‌లర్ డా. కె.నాగజ్యోతి చేతుల మీదుగా ఆమె ప్రతిష్టాత్మక డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇంగ్లీష్ విభాగంలో ఆమె సమర్పించిన "తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాల ప్రభుత్వ , ప్రైవేట్ కళాశాలల్లో టాస్క్-బేస్డ్ అప్రోచ్ ద్వారా రచనా నైపుణ్యాల అభివృద్ధి" అనే పరిశోధన విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల రచనా నైపుణ్యాలను మెరుగుపరచడంలో టాస్క్-బేస్డ్ అప్రోచ్ ప్రభావాన్ని ఈ అధ్యయనం విశ్లేషించింది.ఇంగ్లీష్ భాషా బోధనలో రచనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడే పలు టాస్క్-బేస్డ్ కార్యకలాపాలను ఈ పరిశోధనలో వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. నికిత తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వైస్-చాన్స్‌లర్ డా. కె. నాగజ్యోతి, పరిశోధనా మార్గదర్శకురాలు డా. డి. సునీల, తన భర్త, తల్లిదండ్రులు, సోదరుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సనత్‌నగర్ బాలుడి కిడ్నాప్.. హత్య కేసులో ఉరిశిక్ష

**ప్రధాన నిందితుడు ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణ దండన విధించిన కూకట్‌పల్లి కోర్టు**



**ముద్ర, కూకట్‌పల్లి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సనత్‌నగర్ ఎనిమిదేళ్ల బాలుడు అబ్దుల్ వహీద్ ఖాన్ కిడ్నాప్, హత్య కేసులో కూకట్‌పల్లిలోని మూడవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ దారుణ ఘటనలో ప్రధాన నిందితుడు ఇమ్రాన్ అలీ ఖాన్ అలియాస్ ఫిజాకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది.

ఏప్రిల్ 2023లో అల్లావుద్దీన్ కోటికి చెందిన వసీం ఖాన్ తన కుమారుడు అబ్దుల్ వహీద్‌తో కలిసి మసీదుకు వెళ్లిన సమయంలో బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు చేపట్టిన దర్యాప్తులో, పొరుగునే నివసించే ఇమ్రాన్ అలీ ఖాన్ అప్పు వివాదాల కారణంగా బాలుడిని చాక్లెట్ ఇస్తానని ఆశ చూపి ఇంటికి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు తేలింది.అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ డ్రమ్ములో పెట్టి ఆటో డ్రైవర్ మొహమ్మద్ రఫీక్ సహాయంతో దీనదయాళ్ నగర్ నాలాలో పడవేసినట్లు సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు నిర్ధారించారు.కేసును విచారించిన న్యాయస్థానం నేరం అత్యంత క్రూరమైనదిగా పేర్కొంటూ ఇమ్రాన్ అలీ ఖాన్‌కు హత్య కేసులో మరణశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. కిడ్నాప్ కేసులో జీవిత ఖైదు, సాక్ష్యాల మరుగుపరచినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేసింది.ఆటో డ్రైవర్ మొహమ్మద్ రఫీక్‌కు హత్యకు సహకరించడం, సాక్ష్యాల విధ్వంసానికి పాల్పడినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.న్యాయస్థానం విధించిన మరణశిక్ష తెలంగాణ హైకోర్టు ధృవీకరణ అనంతరం అమలులోకి రానుంది. అప్పటి వరకు ప్రధాన నిందితుడిని చెర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉంచాలని కోర్టు ఆదేశించింది. కేసులో శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, కాల్ డేటాను పక్కాగా సేకరించి ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

### రూ.2.04 కోట్ల అభివృద్ధి పనులకు
## ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన

**ముద్ర, హైదరాబాద్ :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ, దర్గా వెస్ట్రన్ ప్లాజా కాలనీలలో రూ.2 కోట్ల 4 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. నానక్‌రామ్‌గూడలో స్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టి అన్ని సౌకర్యాలతో మహాప్రస్థానం తరహాలో తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో అంత్యక్రియలు నిర్వహించుకునేలా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని వెల్లడించారు.అదేవిధంగా దర్గా వెస్ట్రన్ ప్లాజా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సీసీ రోడ్లు, వరదనీటి కాల్వలు, రవాణా సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని గాంధీ తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తూ ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు.శంకుస్థాపన చేసిన పనులలో నానక్‌రామ్‌గూడలో రూ.80 లక్షలతో స్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణ పనులు, దర్గా వెస్ట్రన్ ప్లాజా కాలనీలో రూ.1.24 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఉన్నాయి. అధికారులు పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ ఆదేశించారు.

## ఎస్కీలో నూతన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభం



హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ESCI)లో నూతనంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభించినట్లు డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌ను స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎక్సలెన్స్‌గా విభజించినట్లు వెల్లడించారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌లో బీటెక్ కోర్సుల కింద సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్), రోబోటిక్స్ అండ్ ఏఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు లభించాయని పేర్కొన్నారు. జేఎన్‌టీయూహెచ్‌తో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ఎడ్యుకేషన్ లోన్లు, అదనపు సర్టిఫికేషన్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని డాక్టర్ రామేశ్వర్ రావు వెల్లడించారు.

## నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో నకిలీ వైద్యులు, అనధికార వైద్య సేవలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రత్యేక దాడులు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా మే 12, 2026న నాగర్‌కర్నూల్ పట్టణం, బిజినేపల్లి గ్రామం, వనపర్తి జిల్లా బుద్ధారం గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలను డాక్టర్ కిరణ్ కుమార్ తోటవార్, డాక్టర్ సన్నీ డేవిస్ అయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. తనిఖీ ల్లో అనుమతులు లేకుండా నడుస్తున్న పలు క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు వెలుగులోకి వచ్చాయి.నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సుశ్మిత హెల్త్ క్లినిక్, రహీమ్ క్లినిక్, శ్రీ సాయి క్లినిక్, రోహిణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రీ దుర్గా క్లినిక్, లక్ష్మి క్లినిక్, అభిరామ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, రాఘవేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ తదితర కేంద్రాలు అనధికారంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. తెలంగాణ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం, నేషనల్ మెడికల్ కమిషన్ చట్టంలోని సెక్షన్లు 34, 54 ప్రకారం నకిలీ వైద్యులు, అనధికార వైద్య సేవలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.తనిఖీ నివేదికలను సంబంధిత జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీస్ శాఖ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపించి న్యాయపరమైన చర్యలు చేపడతామని వెల్లడించింది.

# రైల్ రోకో కేసులో కవితకు సమన్లు

**నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**
**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కవిత**
**కవితతో పాటు 12 మందిపైనా కేసులు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు రైల్ రోకో కేసులో కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. నేడు ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. గతేడాది నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు. ఆ సమయంలో కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి – ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు రైల్ రోకో చేపట్టిన కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై యు/Sec.147&74(ఏ) రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు

## రెండోసారి అసోం సీఎంగా హిమంత ప్రమాణం

**హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, చంద్రబాబు**
**వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్డీయే కూటమి**



**ముద్ర న్యూఢిల్లీ :** అస్సాం ముఖ్యమంత్రిగా ఇవాళ హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది రెండోసారి. ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అస్సాంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వరుసగా ఇది మూడోసారి. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. బీజేపీ నేత రామేశ్వర్ తేలి మంత్రిగా ప్రమాణం చేశారు. బీజేపీ కూటమికి చెందిన ఏజీపీ పార్టీ నేత అతుల్ బోరా, బీపీఎఫ్‌కు చెందిన చరణ్ బోరాలు కూడా ఇవాళ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్డీఏ బృందానికి 102 సీట్లు వచ్చాయి. అస్సాం అసెంబ్లీలో 126 మంది సభ్యులు ఉండగా, దాంట్లో బీజేపీ 82 స్థానాలను చేజిక్కించుకున్నది. ఏజీపీ, బీపీఎఫ్ పార్టీలు చెరి పది సీట్లు గెలుచుకున్నాయి.

## మావోయిస్టుల రహస్య స్థావరం.. రూ. 1.64 కోట్ల నగదు స్వాధీనం

ముద్ర , న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల రహస్య స్థావరాన్ని గుర్తించాయి. 'మాద్ బచావో అభియాన్' కింద డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఎస్పీ రాబిన్సన్ గుడియా ధ్రువీకరించారు. మొత్తం రూ.1.64 కోట్ల నగదు, మూడు ఏకే-47 రైఫిళ్లు, మూడు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు సహా భారీగా ఇతర ఆయుధాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వందలాది తూటాలు, మ్యాగజైన్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీ-టాకీ సెట్లు ఉన్నాయి. జిల్లాను మావోయిస్టు రహితంగా మార్చేందుకు ఇలాంటి ఆపరేషన్లు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 13-05-2026
www.mudranews.in | @mudranews



### కలబందతో ఉల్లిపాయ రసం ఉపయోగం

సెన్సిటివ్ స్కాల్ఫ్ ఉన్నవారు రెండు స్పూన్ల ఉల్లిపాయ రసంలో ఒక స్పూన్ కలబంద జెల్ కలిపి తలకు రాసుకోవాలి. ఇది తలకు చల్లదనం ఇచ్చి మంట, దురద తగ్గించడమే కాకుండా జుట్టు రాలడాన్ని కూడా నియంత్రిస్తుంది.

## గుండె దడను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు

**- పల్స్ ఫీల్డ్ అబ్లేషన్ టెక్నాలజీని ప్రారంభించిన శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్**

**ముద్ర ప్రతినిధి, హైదరాబాద్:** మానవ శరీరంలో సాధారణంగా కనిపించే గుండె దడ సమస్యను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి.ఎస్. రామచంద్ర హెచ్చరించారు. నేడు నిజాంపేట్‌లోని ఆసుపత్రిలో గుండె కొట్టుకునే వేగంలో తేడాలు ఉన్న రోగులకు చికిత్స అందించేందుకు అత్యాధునిక "పల్స్ ఫీల్డ్ అబ్లేషన్" టెక్నాలజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ, గుండెలో విద్యుత్ ప్రవాహంలో లోపాలు తలెత్తడం వల్ల గుండె వేగంగా లేదా నెమ్మదిగా కొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. దీని కారణంగా బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి ప్రమాదాలు సంభవించే అవకా శం ఉందన్నారు. ఈ నూతన టెక్నాలజీ ద్వారా గంట వ్యవధిలోనే చికిత్స పూర్తి చేయవచ్చని, గుండెతో పాటు రక్తనాళాలు, ఆహార వాహికకు ఎలాంటి హాని కలగకుండా శస్త్రచికిత్స నిర్వహించే అవకాశం ఉందని వివరించారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, వయస్సుతో సంబంధం లేకుండా ఈ చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. పాత పద్ధతులతో పోలిస్తే ఈ చికిత్స తక్కువ సమయంలో పూర్తవుతుందని, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, సీనియర్ కార్డియాలజిస్ట్ గోవింద్, డాక్టర్ భరణి మరియు వారి వైద్య బృందం పాల్గొని ఈ నూతన టెక్నాలజీ విశేషాలను ప్రజలకు వివరించారు.

## ఉదండాపూర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**ముద్ర, మహబూబ్‌నగర్ ప్రతినిధి:** పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదండాపూర్ జలాశయం నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించే విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాతో కలిసి ఉదండాపూర్ భూనిర్వాసితుల సమస్యలు, జడ్చర్ల నియోజకవర్గంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులకు అందాల్సిన పునరావాసం, పరిహారం, మౌలిక వసతుల అంశాలపై చర్చించారు. సమస్యలను సానుభూతితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై కూడా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, గ్రామాలు, తండాలు, కాలనీలకు తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్, మోటార్ సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** తెలంగాణ నర్సింగ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి, జిల్లా కార్యదర్శి ఎం. ఆనంద్, మన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ సింధుజ, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట సాయిబాబా, ప్రొఫెసర్ డాక్టర్ సూర్యనారాయణ, ఆర్ఎంఓలు రోహిత్ కుమార్, రవిశంకర్, డాక్టర్ కొటేశ్వర్, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**- రూ.1.24 కోట్ల పనులను ప్రారంభించిన అరెకపూడి గాంధీ**



**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు కాలనీల అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శంకుస్థాపనలు చేశారు. వెంకటేశ్వర కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీల్లో మొత్తం రూ.1 కోటి 24 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, వరద నీటి కాల్వల పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మారబోయిన రాజు యాదవ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాంధీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. హఫీజ్‌పేట్–మంజీరా రోడ్డు నుండి మసీద్‌బండకు వెళ్లే లింక్ రోడ్డులో రైల్వే అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు వరద నీటి కాల్వ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి, వాటర్ వర్క్స్ ఎండీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం

**ముద్ర, కాప్రా:** చర్లపల్లి ఐజీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2009లో జేఎన్ఎన్‌యుఆర్ఎం పథకం కింద నిర్మించిన సుమారు 1200 ఇళ్లలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని వివరించారు. అలాగే, అప్పట్లో నిర్మించిన ఇళ్లలో అనేక స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయని, వెంటనే మరమ్మతులు అవసరమని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఐజీ కాలనీ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు సమాజ ఐక్యతకు ప్రతీకలు

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**ముద్ర, మహబూబ్‌నగర్ ప్రతినిధి:** దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సమాజ ఐక్యతకు ప్రతీకలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని సింహగిరి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆంజనేయ స్వామి, గరుత్మంతుడి సుధామూర్తుల విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వాదాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ అభివృద్ధి కోసం ముడా నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే, ఆలయ పరిసరాల్లో గ్రీనరీ అభివృద్ధి, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షుడు పోల శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయ్య, తిరుపతి నాయక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోంది

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నందునే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో హన్వాడ మండలంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. సి. చరణ్ కుమార్, డి. విజయలక్ష్మి, డి. రాకేష్, ఎన్. అక్షయ, పి. కార్తిక్ పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడంతో వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రాబోయే పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విద్యారంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు సాయినాథ్, శ్రీనాథ్, వెంకటేష్, షాబుద్దీన్, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులపై టీఎప్టీయూ ఆధ్వర్యంలో ఆందోళన

**ముద్ర, మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ పట్టణ సమీ పంలోని దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరులో అవినీతి జరిగిందని టీఎప్టీయూ నాయకులు ఆరోపించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట టీఎప్టీయూ ఆధ్వర్యంలో బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎప్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి. గట్టన్న మాట్లాడుతూ, కాలనీలో సుమారు 60 శాతం మంది అనర్హులకు ఇళ్లు కేటా యించారని ఆరోపించారు. పలువురు లబ్ధిదారులు ఇళ్లలో నివసించకుండా తాళాలు వేసి ఉండగా, మరికొందరు వాటిని అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కేటాయింపుల్లో రెవెన్యూ అధికారుల పాత్రపై విచారణ జరపాలని, అక్రమ లబ్ధిదారులపై చర్యలు తీసుకుని ఇళ్లు స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ జరపాలని కూడా కోరారు.

ఈ కార్యక్రమంలో టిఎప్టియు జిల్లా ఉపాధ్యక్షుడు జలాల్ పాషా, డబుల్ బెడ్‌రూమ్ బాధితులు మాధవి, అనురాధ, విజయలక్ష్మి, దివ్య, హనీఫా బేగం, మొహమ్మద్ బషీర్, అబ్దుల్ రెహమాన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై సీఎం సమీక్ష

**- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రైతులు పండించిన ప్రతిగింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వరి, మొక్క జొన్న కొనుగోళ్లపై జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్ అమరేందర్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొల్లాపూర్ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల సమస్యలపై ఇప్పటికే సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రవాణా, హమాలీ సమస్యల పరి ష్కారానికి మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపట్టినట్లు చెప్పారు. తేమ పరీక్షలు, తూకం, చెల్లింపులపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లింపులు 48 గంటల్లోనే వారి ఖాతా ల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి 'జూపల్లి'

**బస్టాండ్ నుంచి ఆసుపత్రికి గర్భిణులు, బాలింతలకు ఉచిత ప్రయాణ సౌకర్యం**

**ముద్ర ప్రతినిధి, కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతల రవాణా కష్టాలు ఇక తీరనున్నాయి. వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి రామాపురం శివారులో ఉన్న మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వెళ్లేందుకు రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను గుర్తించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ వాహనాన్ని అందుబాటు లోకి తీసుకొచ్చారు.




హైదరాబాద్‌కు చెందిన 'గుడ్ యూనివర్స్' సామాజిక సేవా సంస్థ, 'ఆర్సేసియం' సంస్థల సహకారంతో ఈ పర్యావరణ హిత వాహనాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఈ ఉచిత రవాణా సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సురక్షితమైన, సులభతరమైన ప్రయాణాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనుష్క, వంశీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**- 60 మంది నర్సులకు సన్మానం**




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** "365 రోజులు – 365 కార్యక్రమా లు"లో భాగంగా క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యం లో 132వ రోజు సందర్భంగా నాగర్ కర్నూల్ జనరల్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో 60 మంది నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ రోగుల సేవలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్య మని, వారి కృషిని గుర్తించి సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు.

క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి సేవాభావానికి ప్రతీక అని, సమాజంలో ప్రతి ఒక్కరూ నర్సుల సేవలను గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, రాష్ట్ర ప్రతినిధులు పోల శ్రీనివాస్, కేపీ ప్రసాద్, డాక్టర్ అజీమ్, గిరి జగన్మోహన్ రెడ్డి, జ్ఞానేశ్వరి, నిర్మల, రామ్‌చందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్, రిటైర్డ్ టీచర్ సత్యనారాయణ, కల్వకుర్తి ఎలక్ట్రికల్ గుండ్ల రేవంత్ సహకారం అందించారు.

## జిల్లా అక్రెడిటేషన్ కమిటీ తొలి సమావేశం

**- 146 మీడియా అక్రెడిటేషన్ కార్డులకు ఆమోదం**

**- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా అక్రెడిటేషన్ కమిటీ తొలి సమావేశం మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ హేమంత్ కేశవ్ పాటీల్ అధ్యక్షతన జరిగింది. 2026–2028 కాలానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చిన మీడియా అక్రెడిటేషన్ దరఖాస్తులను సమావేశంలో పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. 252 నిబంధనల ప్రకారం అర్హత సాధించిన జిల్లాస్థాయి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన మొత్తం 146 దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. వీటిని కలెక్టర్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రెడిటేషన్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హోల్డ్‌లో ఉన్న, తిరస్కరించిన దరఖాస్తులపై కూడా సమీక్ష నిర్వహించారు. మంజూరైన దరఖాస్తులపై ఎలాంటి అభ్యంతరాలు లేవని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కిరణ్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 24 గంటల్లో వడ్లు కొనకపోతే తీవ్ర పరిణామాలు

**- యాలాల మండలంలో రైతు దీక్ష నిర్వహణ**

**ముద్ర, తాండూరు ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ దీక్షలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీశైల్ రెడ్డి పంజుగుల మాట్లాడుతూ, 24 గంటల్లోగా వడ్లు కొనుగోలు చేయకపోతే తగిన విధంగా స్పందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. రైతుబంధు, రుణమాఫీ, యూరియా వంటి హామీలు అమలు కావడం లేదని ఆయన ఆరోపించారు. రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు.

మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకుండా చేస్తున్నారని, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీక్షలో పాల్గొన్న నాయకులు, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



**జుట్టు తెల్లబడకుండా కాపాడుతుంది**



ఉల్లిపాయ రసంలో ఉండే కాటలేస్ అనే ఎంజైమ్ జుట్టు వేగంగా తెల్లబడకుండా సహాయపడుతుంది. వారానికి రెండు సార్లు ఉల్లిపాయ రసం వాడటం వల్ల జుట్టు సహజ నల్లదనాన్ని ఎక్కువకాలం నిలుపుకోవచ్చు.

# ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల ధర్నా

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

తమ ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలంటూ నిర్మల్ జిల్లా మామడ మండలం న్యూ సాంగ్వి సమీపంలో 61వ జాతీయ రహదారిపై రైతులు ఆందోళనకు దిగారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, సరిపడా గోనె సంచులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ప్రయత్నం చేసినా ధర్నా విరమించబోమని బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ అమ్మేందుకు తీసుకువచ్చి వారం రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.





## విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకే వేసవి శిబిరాలు

- నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని కలెక్టర్ భవేష్ మిశ్రా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు వేసవి శిబిరానికి రావాలన్నారు. ఇందులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదాపై కౌన్సిలర్ల నిరసన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

సంఘీభావం తెలిపిన ముధోల్ ఎంఎల్ఏ రామారావు పటేల్



నిర్మల్ జిల్లా బైంసా మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించడమేనని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విమర్శించారు. ఎన్నిక వాయిదాకు నిరసనగా మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి తో పాటు బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు సోమవారం అర్ధరాత్రి నుండి ఆందోళన చేపట్టి నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి మాట్లాడుతూ కలెక్టర్ అనుమతితో 12న ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారన్నారు. కాగా సోమవారం రాత్రి కో ఆప్షన్ ఎన్నిక రద్దు అయినట్లు వాట్సాప్ మెసేజ్ పంపడం సరి కాదన్నారు. ఎన్నిక ఎందుకు వాయిదా వేశారో తెలియజేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పై ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ , అధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు చెప్పారు. అవసరమైతే ప్రజాస్వామానికి విరుద్ధంగా వ్యవహరించిన తీరుపై అసెంబ్లీలో మాట్లాడతానని ఎం ఎల్ ఎ పటేల్ పేర్కొన్నారు. ఎన్నిక నిర్వహించే వరకు కౌన్సిలర్లు, చైర్మన్ అక్కడే బైఠాయిస్తారని వారికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు బైంసా మున్సిపాలిటీని పాలించిన ఎంఐఎం పార్టీకి ఇంకా అధికార దాహం వీడలేదన్నారు.

## సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు

**బోథ్, ముద్ర:**



బోథ్ నియోజకవర్గంలోని సొనాల మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కొరకు రూ.70 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సొనాల గుండా అంతరాష్ట్ర రహదారి వెళ్తున్న నేపథ్యంలో సెంట్రల్ లైటింగ్ ను ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు తాము చేసిన విజ్ఞప్తి మేరకు నిధులు కేటాయించడంపై మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. మండల కేంద్రమైన సోనాలా ప్రజల భద్రత కోసం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రూ.70 లక్షల నిధులను విడుదల చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను మంగళవారం హైదరాబాద్‌లో ఈఎన్సీ మోహన్ నాయక్ నుంచి తుల శ్రీనివాస్ అందుకున్నారు. నిధులు కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో గ్రామం రూపురేఖలు మారడమే కాకుండా, రాత్రి వేళల్లో రహదారిపై ప్రమాదాల భయం తప్పుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్...

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**




విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతిలో ఫెయిల్ అయినంత మాత్రాన నిరాశ నిస్పృహలకు లోను కావొద్దని, నేను కూడా పదవతరగతి పరీక్షలో రెండు సబ్జెక్టులు తప్పానని, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో, ఆత్మవిశ్వాసంతో మళ్లీ పాస్ అయి, ఈ రోజు జనాలు అందరూ మెచ్చే వైద్యుడిగా, శాసనసభ్యుడిగా మీ ముందున్నానని అన్నారు. పిల్లలందరూ ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయా సబ్జెక్టులో ఉన్న మెళకువలు నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో పదవ తరగతి పరీక్షలు రాసి పాస్ అయి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇట్టి శిక్షణా కార్యక్రమం పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పిల్లలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చంద్రకళ, గంగాధర్, ధరూర్ క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

**ముద్ర, కోరుట్ల;**

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామం గ్రామపంచాయతీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య మాట్లాడుతూ వరి పంటకు యూరియాని సిఫారసు మేరకు మాత్రమే వాడాలని, చేస్తున్నట్లు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, రైతులు పంట మార్పిడిని కొన సాగించాలని, మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాలు పండించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయాన్ని కొద్ది భాగంలో అయినా సాగుచేయాలని, అలాగే నీటి యాజమాన్యం పై అవగాహన కల్పించారు. అలాగే వరిలో పంట అవశేషాలను తగులబెట్టకుండా కలియదున్నాలని సూచించారు. యూరియా బుకింగ్ యాప్ గురించి అలాగే రైతులు లోతు దుక్కులు చేసుకుంటే కలిగే లాభాలు వివరించారు. కూరగాయల సాగు, మల్చింగ్ సబ్సిడీలు ఆయిల్ పామ్ సాగు, మార్కెటింగ్ అలాగే సబ్సిడీల పై అవగాహన కల్పించారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పి. అంజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, హెచ్ ఈ ఓ బి అన్వేష్, ఏఈ వోలు ఆర్. శ్రీహరి, పి. నరేష్ ఆత్మ మెంబెర్ జి. హనుమక్క, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జువ్వాడి కి ప్రభుత్వ విప్ ఆది అభినందన

**ముద్ర, కోరుట్ల;**

తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా జువ్వాడి మాట్లాడుతూ చైర్మన్ పదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు. అన్ని వర్గాల వారిని కలుపుకొని ముందుకెళ్తానని, పదవిని అందించిన ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు.

# గంజాల్ టోల్ ప్లాజా వద్ద కలెక్టర్ తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



ధాన్యం కొనుగోళ్లు, రవాణాకు ఏర్పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా నిర్మల్ సమీపంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు అధికారులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. టోల్ ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి, వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించం

**ముద్ర, కరీంనగర్:**




ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఆదేశించారు. అవసరమైతే అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్‌మిల్లుల వద్ద కోతలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై వచ్చే ప్రతికూల వార్తలకు జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోళ్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , కరీంనగర్ కలెక్టరేట్ నుంచి ఈ సమావేశంలో ఆర్డీఓ రమేష్ బాబు, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగారావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, డి ఆర్ డి ఓ శ్రీధర్, డి సి ఓ రామానుజ చారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# మొక్కజొన్న నిల్వకు అదనపు గోదాం సిద్ధం

**ముద్ర, పెద్దపల్లి:** జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాంను మంగళవారం పరిశీలించిన ఆయన, రేపటి నుంచే కొనుగోలు కేంద్రాల నుంచి మొక్కజొన్న తరలింపు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో అంతరాయం లేకుండా తగిన హమాలీలను ఏర్పాటు చేయాలని, కొనుగోలు–రవాణా–నిల్వ వ్యవస్థలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, తహసీల్దార్ సునీత, డీటీసీఎస్ అధికారులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 13.05.2026
www.mudranews.in | @mudranews
7
తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

జుట్టు మధ్యలో తెగిపోకుండా రక్షణ
జుట్టు డ్రైగా మారి మధ్యలోనే తెగిపోతుంటే ఉల్లిపాయ రసం మంచి పరిష్కారం. ఇందులోని పోషకాలు జుట్టుకు బలం ఇచ్చి హెయిర్ బ్రేకేజ్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల జుట్టు పొడవుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది.




## నర్సుల సేవలు అభినందనీయం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల సేవలు అభినందనీయమని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో జిల్లాలో సేవలం దిస్తున్న నర్సింగ్ సిబ్బందికి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నర్సింగ్ అధికారులను శాలువాలతో సన్మానించి, వారి సేవలను ప్రశంసించి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. నర్సులు ప్రజల ఆరోగ్య సంరక్షణలో, ముఖ్యంగా తల్లీ–శిశు సంరక్షణ, టీకా కార్యక్రమాలు, అత్యవసర సేవలు వంటి విభాగాల్లో అందిస్తున్న సేవలు అపారమని ఆయన పేర్కొన్నారు. నర్సింగ్ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా ఒక సేవా ధర్మమని, కష్టసమయాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ, ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న నర్సుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపారు. నర్సులు ఎల్లప్పుడూ తమ కర్తవ్యాన్ని నిబద్ధతతో, అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందు తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ ఓ యశోద, ప్రోగ్రామ్ ఆఫీసర్లు వీణ, రామకృష్ణ, పద్మ, సత్యవతి పాల్గొని, నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత క్రికెట్ శిబిరం ప్రారంభం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఉచిత క్రికెట్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా ఎస్పి ఆకాంక్ష యాదవ్ లు అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ), నల్గొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి అమీనుద్దీన్, జిల్లా ఇంచార్జి అబోతుల కేతన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిపుణులైన కోచ్ లతో అండర్–14, 16, 19 బాలబాలికల విభాగాల్లో గణేష్ అకాడమీ వారి సహకారం తో నిర్వహించడం జరుగుతుందని ఉదయం 7 గంటల నుండి 9 వరకు నిర్వహించడం జరుగుతుందని వివరాలకు 8341313449 నెంబర్ కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ సతీష్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ పీఏ జన్మదిన వేడుకలు

**ముద్ర, యాదగిరిగుట్ట:** ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వ్యక్తిగత సహాయకులు పీఏ సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో తోటి సిబ్బంది, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. బీర్ల అయిలయ్య గారి వ్యక్తిగత సహాయకులుగా ఎంతో మంది బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్ఓసీలు అందేలా కృషి చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సంతోష్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరణతో, ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని కోరుకున్నారు.ఈ వేడుకలో పీఏ ఉపేందర్, పీఆర్వో ఆదిమూలం సురేష్, జాంగిర్, కిషన్, నవీన్, అజయ్ త్రివేది మణికంఠ, ప్రసాద్ పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి







**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భక్తకోటి ఆరాధ్యదైవమైన శ్రీ ఆంజనేయస్వామివారి జయంతి సందర్భంగా భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన స్వర్ణగిరి క్షేత్రంలో మంగళవారం శ్రీ కార్యసిద్ధి హనుమజ్జయంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించబడిన 40 అడుగుల ఎత్తైన శ్రీ కార్యసిద్ధి హనుమంతుని విగ్రహానికి అర్చక వేదపండితులు ఆగమోక్తంగా విశేష పూజలు, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు.

**యాదగిరి గుట్టపై..**

**ముద్ర, యాదగిరిగుట్ట :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని కొండపైన పుష్కరిణి వద్దగల ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం సుందరకాండ పారాయణం వేద పఠనం లక్ష తమలపాకు అర్చన మహామంగళ హారతి చేపట్టారు. ఆలయ ఈవో భవాని శంకర్ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి ఉప ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు ఆదిత్యాచార్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ రోడ్డులో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళ వారం హనుమ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భానుపురి హనుమాన్ చాలీసా భక్త బృందం, హనుమత్ దీక్ష భక్త బృందం, హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం చే 108 పర్యాయములు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ లు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగమంతుల స్వామి దేవాలయం చైర్మన్ పోలబోయిన నరసయ్య యాదవ్, మోరిశెట్టి శ్రీనివాస్,కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ, నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కేంద్ర ఉప కార్యదర్శి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని హన్మపూర్, తాజ్‌పూర్ గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ఉప కార్యదర్శి డాక్టర్ మూనా యాస్మిన్ మంగళవారం పర్యటించి పరిశీలించారు.హన్మపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నీటి సంరక్షణ కుంట (వాటర్ హార్వెస్టింగ్ పాండ్), నర్సరీ పనులు, అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాలను సందర్శించి పనుల నాణ్యత, నిర్వహణ విధానం, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను పరిశీలించారు. అనంతరం తాజ్‌పూర్ గ్రామంలో వాగు సమీపంలోని డ్రైనేజ్ లైన్ చివర ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత పనులను పరిశీలించి, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల దిశగా చేపడుతున్న చర్యలను అభినందించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, కలుగుతున్న ప్రయోజనాల గురించి వివరంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, జంగా రెడ్డి, నవీన్, తాజ్‌పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, హన్మపూర్ సర్పంచ్ నాయిని సువర్ణ కృష్ణ, ఎంపీడీఓ భాస్కర్, ఉపాధి హామీ, సెర్ప్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అకాల వర్షాల ముప్పును దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఈ సీజన్‌లో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేయగా, సోమవారం వరకు 2 లక్షల మెట్రిక్ టన్నులను విజయవంతంగా సేకరించామని కలెక్టర్ తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, అధికారులతో ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించడం వల్లనే ఇంత పెద్ద మొత్తంలో సేకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియ నెమ్మదించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హమాలీల కొరత వల్ల అన్ లోడింగ్ ఆలస్యమవుతోందని దీనివల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను రెండింతలు పెంచి, మూడు షిఫ్టుల్లో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రైవేట్ లేదా అదనపు గోదాములను అద్దెకు తీసుకుని ధాన్యాన్ని నిల్వ చేయాలని సూచించారు. ఎస్పీ కె నరసింహ, అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈవో శిరీష, పి.డి.డిఆర్‌డిఓ సన్యాసయ, డిఎస్ఓ మోహన్ బాబు, డివిఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎమ్ఓ నాగేశ్వర్ శర్మ, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

# అక్రమ రవాణా నిర్మూలనకు చెక్ పోస్ట్ లు

**జిల్లా ఎస్పి నరసింహ**




**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** పశువుల అక్రమ రవాణా, ఇసుక, వరి ధాన్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసు శాఖ పటిష్ట నిఘా ఉంచినదని ఎస్పి నరసింహ తెలిపినారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో 24 గంటలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనికిచేస్తునట్లు తెలిపినారు.సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి 65 పై టేకుమట్ల వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్ట్ జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించి వాహనాల తనిఖీలను పరిశీలించారు. చెక్ పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల సమయంలో చెక్ పోస్ట్ సిబ్బంది స్వీయ రక్షణ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్పోస్టులు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ చెక్ పోస్ట్ ల ద్వారా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానత వ్యక్తులకు కదలికలపై పూర్తిస్థాయి నిగా ఉంచామని అన్నారు. వరి ధాన్యం అక్రమ రవాణా జరగకుండా, పీడీఎస్ బియం, ఇసుక, పశువుల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిగా ఉంచి రాత్రింబవళ్ళు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినట్లైతే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం సంతలో కొనుగోలు చేసిన పశువుల రవాణా చేస్తే సంత అధికారులు, పశువుల వైద్యుల అనుమతి పత్రాలు వెంట తీసుకువెళ్ళాలి అన్నారు.ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్, చెక్ పోస్ట్ విధులు నిర్వహణ సిబ్బంది, జాతీయ రహదారుల సిబ్బంది ఉన్నారు.

# వీరవెల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

**: ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని వీరవెల్లి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం వీరవెల్లి గ్రామపంచాయతి నూతన పాలకవర్గం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధిక నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. హెచ్ఎండిఏ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, పలు వార్డులలో నూతన డ్రైనేజీలు సీసీ రోడ్డు, బీటి రోడ్డు కు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు గ్రామ సర్పంచ్ తోటకూరి శంకరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సర్దార్ శ్రీకాంత్, మండల కాంగ్రెస్ నాయకులు 9వ వార్డు సభ్యులు సోకం రాజశేఖర్, వార్డు సభ్యులు కంచి పద్మ, చందుపట్ల స్వామి, నల్లారమేష్, సర్దార్ శోభ, రాచ మల్ల సాయికిరణ్, తోటకూరి శ్రీలత, చిన్నం విజయ, మాధను శేపూరేయ్య పాల్గొన్నారు.

## బాలిక రక్షణను గాలికొదిలేశారు

**ముద్ర, యాదగిరిగుట్ట :** కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ అరాచకానికి బలైపోయిన బాలిక రక్షణను సీఎం రేవంత్ రెడ్డి గాలికొదిలేశారని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్ళెం స్వాతి విమర్శించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఉన్న శ్రద్ధ బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో లేదని మండిపడ్డారు. బండి సంజయ్ కొడుకు భగీరథ్ ను అరెస్ట్ చేయాలనీ డిమాండ్ చేశారు. సంజయ్ కేంద్ర మంత్రి పదవితో పాటు ఎంపీ స్థానానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన



**ముద్ర, యాదగిరిగుట్ట :** గత నెల రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా ఆరోపణలు చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల బస్తాలను తగలబెట్టి వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల కంట కన్నీరు పెట్టిస్తుందన్నారు ధాన్యం కొనుగోళ్ల విషయంలో తీవ్రమైన జాప్యం చేస్తుండడంతో పాటు తరుగు పేరిట మోసం చేస్తున్న వారిని నియంత్రించకపోవడం కెసిఆర్ హయంలో వ్యవసాయం పండుగలా ఉండగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం దండగలాగా చేస్తున్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోజురోజుకు ధాన్యం కొనుగోలు జరిగేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య పట్టణ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, రైతులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు భిక్షపతి పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అనుచిత కంటెంట్ పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని వారికి పరువు నష్టం కలిగే విధంగా అనుచిత వ్యాఖ్యలు, బెదిరించే విధంగా సోషల్ మీడియాలో కంటెంట్ పెడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతు ముదిరాజ్ మహాసభ నాయకులు మంగళవారం భువనగిరి పట్టణ సీఐ రమేష్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొలుపుల హరినాథ్, సాదు విజయ్ కుమార్ లు మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా కోనేటిపూర్ గ్రామానికి చెందిన నూకం జాన్ ముదిరాజ్, వనపర్తి జిల్లా మనుగిల్ల గ్రామానికి చెందిన వై. శివ ముదిరాజ్, అల్లదుర్గం సురేష్ లు ప్రముఖ ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, ఎంపి ఈటెల రాజేందర్, మంత్రి వాకిటి శ్రీహరిల పై సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా విపరీతమైన దుర్భషలాడుతు, అసహ్యమైన భాషతో బెదిరించే విధంగా కంటెంట్ తయారు చేసి పెడుతున్నారని ఆరోపించారు. వీరు తయారు చేసే కంటెంట్ ప్రముఖులపై వ్యక్తిగతంగానే కాకుండా వారి కుటుంబ సభ్యులపై కూడా అనుచితంగా ఉండే విధంగా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.నూకం జాన్ అలియాస్ నాని "జనతా న్యూస్ ఆప్", "ముదిరాజ్ హిస్ట్రీ టివి" సి.ఈ.ఓ.గా ఉండి వీటి ద్వారా ముదిరాజ్ కమ్యూనిటి నాయకులను అత్యంత అవమానకరమైన బాషను ఉ పయోగిస్తు వారిని తిడుతు వారిని బెదిరింపులకు గురిచేస్తున్నాడని ఇతనిపై 196(1), 197(1), 299, 352, 353(1)(2), 356(2) కేసులు నమోదు చేశారని చెప్పారు. వారిపై సమగ్ర విచారణ చేసి సంబంధిత చట్టాల ప్రకారం తగిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట నర్సింహా, కన్వీనర్ ఉడుత భాస్కర్, జిల్లా నాయకులు పిట్టల బాలరాజు, కనక బాలరాజు – బోయిని బాలయ్య. పిట్టల రాములు. ఇట్టబోయిన గోపాల్, ఎనబోయిన జహంగీర్, గీస కొండల్ పాల్గొన్నారు.

## 18న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి



**ముద్ర, బీబీనగర్ :** ఈనెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభల సందర్భంగా 18వ తేదీన సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న బహిరంగలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, పేదలు, కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ పిలుపునిచ్చారు. మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలోని కూలీ వాడలో జిల్లా మహాసభల "కరపత్రం "ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక కూలీ, భూమి, ఉపాధి, సంక్షేమం, విద్య, వైద్యం, కూలీ పేటలో అభివృద్ధిపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా సంఘం నిలిచిందని తెలిపారు. చేపట్టబోయే ఉద్యమాలను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొలిచెలిమి ప్రసన్న, కార్యదర్శి గాడి శ్రీనివాస్, మండల నాయకులు బండారు శ్రీరాములు, గ్రామ నాయకులు, వ్యవసాయ కార్మికులు సాకలి మంజుల, కుమారి, పేరబోయిన బాల్ నర్సింహ, కొలిచెలిమి గండయ్య, సాకలి శివ ,బాలరాజు, ధ్రువచంద్ర , ఈశ్వర్ , రాజేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు సేద్యం చేస్తున్న పేదలకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలి




వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : జిల్లాలో ఐదు మండలాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ పేదలందరికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరిలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం భువనగిరి మండల మహాసభలో ముఖ్య అతిధులుగా యాదగిరి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలు ఇస్తానని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ నెల 15న దేశవ్యాప్తంగా ఉపాధి హామీ రక్షణ కోసం నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 15 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నోముల జ్యోతి, కార్యదర్శిగా పల్లెర్ల అంజయ్య, ఉపాధ్యక్షులుగా కొండపురం యాదగిరి, మాణిక్యం, సహాయ కార్యదర్శులుగా కూకుట్ల చొక్కాకుమారి, నరాల చంద్రయ్య, బొల్లెపల్లి కిషన్ మిగతా 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు, బోడ ఆంజనేయులు, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 13.05.2026
www.mudranews.in | @mudranews



**ఉల్లిపాయ వాసన పోవాలంటే**



ఈ చిట్కాతలకు ఉల్లిపాయ రసం రాసిన తర్వాత షాంపూతో తలస్నానం చేసి చివరగా నీళ్లలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి కడిగితే ఘాటు వాసన తగ్గిపోతుంది. జుట్టు కూడా ఫ్రెష్‌గా ఉంటుంది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్లను ఆదేశించిన ముఖ్యమంత్రి
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్‌మిల్లుల వద్ద కోతలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.స్థానిక హమాలీలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలని సీఎం ఆదేశించారు. ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించాలని, కొనుగోళ్లను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. టార్పాలిన్లు, హమాలీలు, రవాణా వాహనాలు అందుబాటులో ఉంచి కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాల్లో వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోలు ఎలాంటి ఇబ్బంది పడకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ఏర్పాటు చేయడం జరిగింది అని, దాన్ని రవాణాకు ఇబ్బంది కలగకుండా రవాణా మరియు పోలీస్ శాఖల సహకారంతో పర్యవేక్షిస్తున్నామని, అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, హమాలీల కొరత లేకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా సహకార అధికారి వరలక్ష్మి , జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ, తూనీకలు కొలతల అధికారి శివరంజని పాల్గొన్నారు.



## లేబర్ కోడ్స్ గెజిట్ ప్రతుల దహనం

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుకు నిబంధనలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, యూనియన్ జిల్లా కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. సిద్దిపేట సర్కిల్ ఆఫీస్ విద్యుత్ భవన్ ఎదుట గెజిట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు లేబర్ కోడ్స్ అమలును వాయిదా వేసి, ఫలితాల తర్వాత అమల్లోకి తేవడం మోడీ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేలా రాష్ట్ర ప్రభు త్వాలు లేబర్ కోడ్స్‌లో సవరణలు తీసు కురావాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కార్మిక సమస్యలు రాజ్యాంగ ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్రా లకు చట్టపరమైన అధికారం ఉందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు ఐక్య కార్మిక ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ర్యాకం అశోక్‌తో పాటు కార్మిక నాయకులు పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణ వేగం పెరగాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగం పెంచాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్, పోలీస్, గ్రామీణాభివృద్ధి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులలో ఎంతమంది హమాలిలు ఉన్నారు, ఎన్ని లారీలు ఉన్నాయని తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగంగా జరగాల ని, అన్లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని, లారీల సంఖ్యను పెంచాలని, లారీలు అందుబాటులో లేకుంటే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా అనుమతించాలని , అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని,అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలనీ అధికారులను ఆదేశించారు. మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను అందుబాటులో ఉంచలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ అం బాదాస్ రాజేశ్వర్, ఆర్డీఓ రమాదేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, వ్యవసాయ అధికారి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**1,00,534 మెట్రిక్ టన్నులు కొనుగోలు**

జిల్లాలో ఇప్పటి వరకూ 21, 208 రైతుల నుంచి 1,00,534 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 9710 మంది రైతులకు 111.90.కోట్ల రూపాయలు చెల్లించామన్నారు.

**ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలి**

జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్లో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి

కలెక్టర్, ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు కోరారు. కలెక్టరేట్లో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు.

సమాజంలో సౌభ్రాతృత్వం, ప్రేమ, పరస్పర గౌరవం పెంపొందించే ఈ పవిత్ర పండుగను అందరూ ఐకమత్యంతో నిర్వహించాలని సూచించారు.

బక్రీద్ పండుగ త్యాగానికి, సేవాభావానికి ప్రతీక అని పేర్కొంటూ, పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం అన్నారు. బక్రీద్ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించి పండుగను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి వెంకట స్వామి, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, డిఎస్పిలు, సిఐలు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి

**ముద్ర ప్రతినిధి,, మెదక్:**



మెదక్ పట్టణం గోసముద్ర తటాక తీరాన వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశానుగత ధర్మకర్త కాకులవరం మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ఆవుపాలతో అభిషేకం, మహాఅలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ గావించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. మెదక్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



## గ్రంథాలయ అభివృద్ధి కి కృషి చేస్తా

- జిల్లా గ్రంథాలయం చైర్మన్ దరిపల్లి చంద్రం

**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:**




సిద్దిపేట జిల్లా లో ఉన్న గ్రంధాలయాల అభివృద్ధి కి కృషి చేస్తానని సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గ్రంధాలయ చైర్మన గా బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ జిల్లా లో 17 గ్రంధాలయాలు ఉన్నాయన్నారు. గతంలో నిధులు లేక నిర్లక్ష్యనికి గురి అయ్యాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి గ్రాంధాలయాల అభివృద్ధి కి నిధులు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు.

## పాలీసెట్-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి




**ముద్ర, సంగారెడ్డి :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలీసెట్-2026 పరీక్షకు సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు. ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# బ్యాంకునే మోసం చేసిన మేనేజర్

- రూ. 179.54 కోట్ల రూపాయలు డ్రా
- ముగ్గురు అరెస్ట్, పరారీలో మేనేజర్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



కంచె చేను మేసిన చందంగా పనిచేసిన బ్యాంకునే మోసం చేసి 179.54 కోట్ల రూపాయలు డ్రా చేసిన మేనేజర్ సంఘటన జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. ఈ కేసులో ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేయగా మేనేజర్ పరారీలో ఉన్నాడు. డీఎస్పీ ప్రసన్న కుమార్ కథనం ప్రకారం... మెదక్ పట్టణంలో గల ఆదర్శ కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మేనేజర్ యాదం అనిల్ అతని బార్య, స్నేహితులు ఇతరుల ఆధార్, పాన్ కార్డులు తీసుకుని వారి పేర్ల మీద నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో 16 లోన్ లు తీసుకున్నాడు. అలాగే 2 ఎటిఎంల నుండి నగదు డిపాజిట్ చేసే సమయంలో 31.35 లక్షలు నగదును బ్యాంకును మోసం చేసి వాడుకున్నాడు. అయితే 16 అకౌంట్ల ద్వారా వన్ గ్రాం బంగారు నగలను ఒరిజినల్ బంగారంగా చూపి బ్యాంకు నుండి రుణాలు తీసుకున్నాడు. బ్యాంకు అప్రైజర్ శ్రీనివాస చారి నకిలీ బంగారంని తనిఖీ చేసి ఒరిజినల్ అని చెప్పి బ్యాంకు మేనేజర్ కు సహకరించాడు.

మేనేజర్ యాదం అనిల్ స్నేహితుడు సుబ్రహ్మణ్యం, భార్య స్రవంతి ఆధార్, పాన్ కార్డులు వాడుకుని నకిలీ బంగారం పెట్టి లోన్ లు తీసుకుని ఇద్దరు వాడుకున్నారు.

***సైబర్ క్రైం ఫిర్యాదుతో...**

మేనేజర్ బార్య స్రవంతి సైబర్ క్రైంకు చేసిన ఫిర్యాదుతో మోసం బయట పడింది. బ్యాంకు అధికారులు ఆమె అకౌంట్ తో పాటు బ్యాంకులో మొత్తం 199 బంగారు రుణాల అకౌంట్లు పరిశీలించారు. ఇందులో 16 దొంగ అకౌంట్ల ద్వారా సుమారు కోటి 79 లక్షలు దొంగ బంగారు నగలపై రుణం తీసుకున్నట్లు తేలింది. దీంతో బ్యాంకు సీఈఓ వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మేనేజర్ యాదం అనిల్ పరారీలో ఉండగా ఆయన బార్య స్రవంతి, మిత్రుడు సుబ్రహ్మణ్యం, అప్రైజర్ శ్రీనివాస్ చారిలను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. మేనేజర్ కోసం ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ మహేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**మేనేజర్ అనిల్ గతంలో మోసం**

మేనేజర్ యాదం అనిల్ ఆంధ్రప్రదేశ్ వేలేరుపాడు పోలీస్ స్టేషన్ పరిదిలోని ఎపి గ్రామీణ వికాస్ బ్యాంక్, వేలేరుపాడు బ్రాంచ్ లో పనిచేశాడు. ఆ సమయంలో పోలవరం నిర్వాసితులు, గిరిజనులను మోసం చేసి 11,82,487 డబ్బులు వాడుకుని జైలుకి పోయిన చరిత్ర ఉంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited Printed at Colour Dot Graphics, Ali cafe X Road. Amberpet, Hyderabad-500013 Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound. Soma jiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy **RNI No: TELTEL/2013/50413.** email: mudradaily@gmail.com